రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బి మెన్ అండ్ ఉమెన్ జట్లు ఎంపిక జరిగింది. రగ్బి అసోసియేషన్ అధ్యక్షులు పాలపర్తి దొరబాబు, డిస్టిక్ స్పోర్ట్స్ డవలంప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. జిల్లా నలమూలాల నుంచి 50 మంది మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులు పాల్గొన్నారు. 12 మంది మెన్ 8 మంది ఉమెన్స్ ఎంపికయ్యారు. ఈ నెల 14. 15 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారు. న్యాయ నిర్ణేతలుగా ఎల్.సతీష్, బి.వంశీ, పి.లక్ష్మణరావు వ్యవహరించారు.

వేసవిలో ఇంటర్ క్లాసులు..!

- విద్యార్థుల అవస్థలు
- కార్పొరేట్ అనుకూల సంస్కరణలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎండలు మండిపోతున్నాయి. 38 నుంచి 40 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో భానుడు మరింత తీవ్ర రూపం దాల్చి ప్రతాపం చూపే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఎండలకు పలు జాగ్రత్తలు అవసరమని వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులు సూచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా విద్యార్థులకు ఒంటిపూట బడులు, తర్వాత వేసవి సెలవులు ఇస్తారు. కానీ కూటమి సర్కారు ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యారంగంలో సంస్కరణలను తీసుకొచ్చింది. ఎవరితోనూ చర్చించకుండానే అకడమిక్ క్యాలెండర్ రూపొందించి మండు వేసవిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 1 నుంచి తరగతులను ప్రారంభించారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పలువురు విద్యార్థులు కళాశాలలకు రావడం లేదు. మరోవైపు కొత్త సంస్కరణలపై అవగాహన కల్పించకపోవడంతో పూర్తిగా అనాసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 44 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం సుమారు 21 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో మరో 1.30 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఇప్పుడు రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ నెల 1 నుంచి క్లాసులను ప్రారంభించింది. పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీ చేస్తోంది.

అరకొరగానే హాజరు

మండుతున్న ఎండలకు ఇంటర్ తరగతులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నామమాత్రంగానే హాజరవుతున్నారు. ప్రారంభం నుంచే విద్యార్థులు అరకొరగా మాత్రమే వస్తున్నారు. కాకినాడ పిఆర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 350 మంది ఉండగా 100 మంది లోపే హాజరవుతున్నారు. పిఠాపురం ఆర్ఆర్ బిహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో 330 మంది ఉండగా 80 మంది లోపే తరగతులకు వస్తున్న పరిస్థితి ఏర్పడింది. విద్యా రంగంలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు. ఏటా వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తుంటారు. కానీ తాజాగా విద్యా క్యాలెండర్‌తో ఇటీవల పరీక్షలు రాసి వేసవి సెలవుల మూడ్ లోకి వెళ్లిన విద్యార్థులను కాలేజీలకు రండి అని కబురు పంపినా, వారి నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. అంతేకాక వరుసగా ఉగాది, రంజాన్ పండుగలు జరుపుకుని వెనువెంటనే కళాశాలలకు వచ్చేందుకు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ముందస్తు ఎలాంటి కసరత్తు, క్షేత్రస్థాయి ప్రణాళిక లేకుండా ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభం, 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు అంటూ అయోమయానికి గురి చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి చెందుతున్నారు.

పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరైన అరకొరగానే హాజరైన విద్యార్థులు

కార్పొరేట్‌కు సర్కారు వత్తాసు

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలకు అనుకూలంగా ఈ నెల 1 నుంచి ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోసం కాక కార్పొరేట్ కాలేజీలకు అనుకూలంగా ప్రతి సంవత్సరం సమ్మర్ క్లాసులు పేరు చెప్పి నిర్వహించుకునేదానికి ప్రభుత్వమే ముందుండి జిఒలు ఇవ్వడంపై తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీన పరీక్షలు పూర్తవగా ఇంకా ఫలితాలు రాకుండానే 7 నుంచి అడ్మిషన్ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డురంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు చేసుకోవడానికి ప్రభుత్వమే అవకాశం ఇచ్చినట్లుగా ఉందని ఆరోపిస్తున్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టవా..?

రాష్ట్ర ప్రభుత్వానికి కార్పొరేట్, ప్రైవేటు కళాశాలపై ఉన్న మక్కువ ఈ జిఒ ద్వారా అర్థమవుతోంది. ఒకపక్క వాతావరణ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరం విపరీతంగా ఎండలు ఉంటాయని హెచ్చరిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో జూనియర్ కళాశాల ప్రారంభించడం సరికాదు. పదో తరగతి ఫలితాలు రాకుండానే ఇంటర్మీడియట్‌లో ఏ విధంగా చేర్చుకుంటారో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. విద్యా వ్యవస్థను మొత్తం ప్రైవేట్, కార్పొరేట్‌లకు అప్పజెప్పడం కోసమే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

- ఎం.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ.

ఎండలకు ఇబ్బంది పడుతున్నాము



ప్రస్తుతం ఎండలు బాగా ముదిరిపోయాయి. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం నుంచి తరగతులు వెంటనే ప్రారంభించడం ఇబ్బందిగా ఉంది. విద్యార్థుల సమస్యలను దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పునరాలోచించి వేసవి సెలవులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బి.లక్ష్మీనారాయణ, ఇంటర్ రెండో సంవత్సరం, పిఠాపురం.

ఒంటి పూట మాత్రమే నడపాలి

వేసవికాలంలో అకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే తరగతులు పెట్టడం వల్ల ఏకాగ్రతను కోల్పోయే అవకాశం ఉంది. సెలవులు లేకపోతే ఎలా.? ప్రభుత్వం కనీసం ఒంటి పూట తరగతులైనా నిర్వహించాలి.

- వి.వరలక్ష్మి, సెకండ్ ఇయర్.

ఏర్పాట్లపై నిర్వాహకులతో చర్చిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్‌పి బిందుమాధవ్

సైనిక విన్యాసాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ భారత్, అమెరికా వాయుసేనా దళాలు ఉమ్మడిగా నిర్వహించనున్న టైగర్ ట్రియంఫ్-2025 సైనిక విన్యాసాల ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి బిందుమాధవ్ పరిశీలించారు. శనివారం రూరల్ మండలంలోని సముద్ర తీరంలో స్టేట్ హైవే బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, క్రౌడ్ నియంత్రణ, సైనిక విన్యాసాలు దృష్యా ప్రవేశ అనుమతి ఉండని నో పబ్లిక్ జోన్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రియంఫ్-25 కార్యక్రమాన్ని విజయవంతానికి కృషి చేయాలన్నారు. భారత్, అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నం, కాకినాడ తీరంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సైనిక విన్యాసాలు సక్రమంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో ట్రైనీ ఐపిఎస్ సుస్మిత, డిఆర్ఒ జె.వెంకటరావు, సివిల్-మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వైకె.కిషోర్, సైనిక అధికారులు టివివి.ప్రసాద్, డిపిఒ వి.రవికుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి పివిఎస్ రాజేష్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ, మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

7వ రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోనేటి రాజు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో కృష్ణా జిల్లా కొండపల్లిలో సంఘం రాష్ట్ర మహాసభలు జరుగు తాయని తెలిపారు. మహాసభల జయప్రదానికై వృత్తిదారులంతా కృషి చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర మహాసభల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కోజ్జవరపు నాగేశ్వరరావు, మాణిక్యం, గనిరాజు, ఎం.లోవరాజు, గంగాధరరావు, అప్పారావు, శ్రీను, సాయిబాబా పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

వయోజన విద్య సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక బొజ్జ వారి తోటలో లిటిల్ స్టార్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, లిట్రిసి ఇండియా ట్రస్ట్ - చెన్నై ఆధ్వర్యంలో శనివారం వయోజన విద్యా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ టి.కామేశ్వర రావు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో రౌతులపూడి, ముమ్మిడివరం, జగపతిరాజపురం, నేమాం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో 15 వయోజన విద్యా సెంటర్స్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ వయోజన విద్యా సెంటర్ల ద్వారా సులభమైన పద్ధతిలో విద్యను నేర్పించడమే కాక స్త్రీలకు చేతివృత్తులపై శిక్షణ, ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. లిట్రిస్ ఇండియా ట్రస్ట్ - ఆధ్వర్యంలో వయోజన విద్యకు సంబంధించిన పుస్తకాలు, పలకలు, బ్లాక్ బోర్డ్, ఛార్జింగ్ లైట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.రాధ, కెవిపి.ప్రసాద్ కె.అప్పారావు, కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, జనతా ఫౌండేషన్ అధ్యక్షులు జమ్మూ, బి.నానిబాబు, టి.బ్యూలాగ్రేస్, టి.కృపారాణి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ కామేశ్వరరావు

'సస్పెన్షన్ లేఖ దొరబాబు పనే'

ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి నుంచి తనను సస్పెండ్ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పనేనని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, ఆమె భర్త కృష్ణమూర్తి ఆరోపించారు. శనివారం తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తనపై అవిశ్వాసానికి వైసీపీ కౌన్సిలర్లు చేస్తున్న ప్రయత్నాలపై బహిరంగంగా తాను మీడియా ముందుకొచ్చి మాట్లాడిన రాత్రికి రాత్రే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు లేఖ ఎలా పుట్టుకొచ్చిందని అన్నారు. పార్టీకి వెన్నంటి ఉంటూ నిజాయితీగా పని చేసినందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఛైర్‌పర్సన్ పదవి నుంచి తనను తొలగించి ఒక కాంట్రాక్టర్ భార్యకు కట్టబట్టేందుకు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. దొరబాబే ఈ లేఖను సృష్టించారని విమర్శించారు. దవులూరి మాదిరిగా అధికార దాహంతో పార్టీలు మార్చే అలవాటు తమకు లేదన్నారు. 2019 ఎన్నికల్లో తోటవాణికి వెన్నుపోటు పొడిచి, అప్పటి పార్టీ ఇన్‌ఛార్జ్ తోట సుబ్బారావు నాయుడును తొలగించేలా చేశారన్నారు. ఇలాంటి వ్యక్తి నియోజకవర్గంపై పెత్తనం చేయడం పార్టీకి మంచిది కాదన్నారు. పార్టీ పటిష్టతకు చర్యలు చేపట్టాలని అధిష్టానాన్ని వారు కోరారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా జరిగింది.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశ స్వాతంత్రయానికి ముందు, తరువాత దేశ అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మంత్రిగా కార్మికులు, రైతుల కోసం అనేక చట్టాలు చేశారని గుర్తు చేశారు. నేడు దేశాన్ని ఏలుతున్న బిజెపి ప్రభుత్వం ఆ చట్టాలకు తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బి.సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షులు కెఎస్.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు జి.సత్యానందం, కె.పద్మనాభం, ఐద్వా రాష్ర నాయకులు సిహెచ్.రమణి, జిల్లా నాయకులు భూలక్ష్మి పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎస్‌పి బిందుమాధవ్ పూలామాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి శ్రీహరిరావు, జిల్లా కార్యాలయ వివిధ విభాగాలు ఇన్వెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కెవిపిఎస్ ఆధ్వర్యంలో లేడీస్ క్లబ్ వెనుక ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహనికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఇంద్రపాలెం లేడీస్ లయన్స్ క్లబ్ వద్ద జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహనికి కలెక్టర్ షాన్‌మోహన్, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, జెసి రాహుల్ మీనా, జిల్లా అధికారులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్‌విపి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ జి.శ్రీనివాసరావు, సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ జేడీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి జె.సత్యవతి, బిసి సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున, ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణంలో ర్యాలీ నిర్వహించారు అరుంధతి పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్, డాక్టర్ బిఆర్.అబేద్కర్ విగ్రహాలను ఎంఇఎఫ్ జాతీయ నాయకులు డాక్టర్ సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కాకాడ నూకరాజు, వల్లూరి సత్తిబాబు, అనంతారపు రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూలపల్లి వెంకటరమణ, దేవరపు సురేష్, నేకూరి ప్రసాద్, గంధం మణికుమార్ పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానికంగా జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, సర్పంచ్ హేర్జమ్మ, ఉప సర్పంచ్ భాస్కర్‌బాబు, టిడిపి నాయకులు పైల వేణు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని గొల్లపాలెం, కాజులూరు అరుంధతి పేటలలో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుని స్మరించుకోవడం అదృష్టమని అన్నారు. నేటి తరానికి ఆయన సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాల కృష్ణారావు, జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, నీటి సంఘం అధ్యక్షులు యాల సత్యనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు యాల వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని ఎస్.తిమ్మాపురంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తోపాటు, దళిత నాయకులు, యువకులు పాల్గొన్నారు. **కోటనందూరు** తుని, కోటనందూరు మండలాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు నూతనంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొడ్డ బాబ్జి, వేగి అప్పలనాయుడు, జగటాల వీరబాబు, నల్లమిల్లి గోవిందు, చింతకాయల చినబాబు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక అరుంధతి పేటలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వమించారు. ఈ కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావు, వైసిపి నాయకులు తోట రాంజి పూలమాలేసి నివాళులర్పించారు. మురారిలో ఉప సర్పంచ్ జాస్తి వసంత్, సుంకవల్లి రమేష్, ఎస్ఐ శివనాగబాబు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **పిఠాపురం** పట్టణంలో పలుచోట్ల జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. సిఐటియు అనుబంధ సంఘం పట్టణ రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉప్పాడ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెదపాటి సత్యనారాయణ, సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరరావు, సంఘం నాయకులు పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణంలో పలు ప్రాంతాల్లో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని జడ్.భావారం జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్ పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **పెద్దాపురం** స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీరమణి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కొండయ్యపేటలోని మున్సిపల్ పాఠశాల వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేశారు.

కాకినాడలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడలో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

కాజులూరులో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుబాష్

కార్టూ'నిజం'



ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. శనివారం స్థానిక బాలికల హాస్టల్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబుతో కలిసి ఆయన సందర్శించారు. తొలుత జగ్జీవన్‌రామ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వసతి గృహంలో కల్పిస్తున్న సదుపాయాలు, భోజనం ఏర్పాట్లు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌కు అవసరమైన ఇన్వర్టర్, ఆర్ఒ ప్లాంట్, సిసి కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ జెడి ఎస్ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, ఎఎస్‌డబ్ల్యూఒ వై.వాణి, వార్డెన్ సిహెచ్.ఉమాదేవి, సూపరింటెండెంట్ ఐ.శ్రీనివాస్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెద్దకాపు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాయవరపు వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా రమేష్

ప్రజాశక్తి - తుని

తుని మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా కోటనందూరు మండలం కెఇ.చిన్నిపాలెం గ్రామానికి చెందిన అంకమ్మరెడ్డి రమేష్ నియమితులు అయ్యారు. ఈ మేరకు శనివారం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా టిడిపిలోనే ఉంటూ సర్పంచ్, ఎంపిటిసి, నీటి సంఘాల అధ్యక్షులుగా పనిచేసేందుకు పార్టీ అధిష్టానం అవకాశం కల్పించిందన్నారు. తన సేవలను గుర్తించి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ యనమల దివ్య తనను తుని మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు టిడిపి నాయకులు గాడి రాజబాబు, లగుడు శ్రీరామమూర్తి, షేక్ నవాజ్ జానీ, లగుడు సత్యనారాయణ, చింతమనేడు అబ్బాయి అభినందనలు తెలిపారు.

పలుచోట్ల కుండపోత

ప్రజాశక్తి - కోటనందూరు, గొల్లప్రోలు

మండలంలోని అల్లిపూడి గ్రామంలో శనివారం పెనుగాలితో కూడిన వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఎండ తీవ్రతతో అల్లాడుతున్న తరుణంలో కురిసిన వర్షంతో ప్రజలు చేదతీరారు. ఎండిపోయి బీటలు వారిన పంట భూములకు ఈ వర్షం ఎంతో దోహదపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే గొల్లప్రోలులో ఈదురు గాలులతో శనివారం కురిసిన అకాల వర్షంతో పనలపై ఉన్న వరి పంట తడిసిముద్దయింది. తడిసిన వరి పనలను శుభ్రం చేసేందుకు పెట్టుబడి పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరారు.

కోటనందూరులో కుసిరిన వర్షంతో వీధులు

యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ, పిఠాపురం

ఈ నెల 7న కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. అలాగే పిఠాపురం పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్‌లోని పాడా కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని పాడా పీడీ చైత్రవర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

11న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో ఈనెల 11న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బిటెక్, పీజీ చేసిన 35 సంవత్సరాల వయసు మించని అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలపారు.

ఘనంగా పాఠశాల 15వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి శివారులో ఉన్న తక్షశిల ఇంగ్లీష్ మీడియం పాఠశాల 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కరస్పాండెంట్ తొండాపు రఘురాం ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు పలు సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రయివేటు పాఠశాలల అధ్యక్షులు డి శ్రీనివాస్, ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డి.సత్యనారాయణ, లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ డి.బీజు జోషన్. పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నాగాంజలి, ప్రవీణ్ మరణాలతో ఉత్కంఠ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నమ్మినవాడే నయవంచకుడై ఓ ఫార్మా విద్యార్థిని బలగొన్న ఉదంతం జిల్లా ప్రజలను కలచి వేసింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాగాంజలి 12 రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఈ నెల 4న తుదిశ్వాస విడిచింది. నాగాంజలి మృతి, అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగిన పోస్టు మార్టం, ఆపై మృతదేహం ఆమె సొంత ఊరికి తరలింపు వంటి పరిణామాలు అత్యంత నాటకీయంగా జరిగాయి. మృతదేహాన్ని తరలించే క్రమంలో విద్యార్థి, ప్రజా సంఘాలు ఆందోళనకు చేసిన ప్రయత్నాలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన కారులను చెదరగొట్టి అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించిడంపై సర్వత్రా విమర్శలు వినిపించాయి. కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో మెడికల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దీపక్ వేధింపుల వల్లే నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సూసైడ్ నోట్ ద్వారా బయటపడింది. దీంతో ఎట్టకేలకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. విబి 10 ఎంజి స్వయంగా చేసుకోలేరని ప్రభుత్వ వైద్యుల బృందం స్పష్టం చేసింది. ఈ ఇంజెక్షన్ తానే చేసుకుందా..? లేక మరెవరైనా చేశారా..? అనేది నేటికీ తేలలేదు. నాగాంజలి మరణం అనంతరం జిజిహెచ్‌కు తరలించటం, పోస్టు మార్టం పూర్తికాక మునుపే తల్లిదండ్రులను పంపించడం వంటి పరిణామాలపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లేదా రాజీమార్గం ద్వారా కేసును నీరుగార్చే ప్రయత్నం ఉందా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. పారదర్శకంగా విచారణ జరిపి ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగం ఉంది.

పత్తాలేని డిప్యూటీ సిఎం, హోం మంత్రి

ఆడపిల్లలను తరలించేస్తున్నారు... ఆడపిల్లలకు భద్రత కరువైంది... 30వేల మంది ఆచూకీ లేదు... అంటూ ఎన్నికల ముందు హడావుడి చేసిన జనసన అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నాగాంజలి ఘటనపై నోరు కూడా మెదపలేదు. బాధితురాలి తల్లిదండ్రులను కనీసం ఫోన్‌లో కూడా పరామర్శించిన దాఖలాలు లేవు. పిఠాపురం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆయన ఈ ఘటనపై కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన చోటు చేసుకున్న 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న హోం మంత్రి అనిత కూడా కనీసం నాగాంజలిని పరామర్శించడానికి రాలేదు. ఈ ఘటనపై విద్యార్థులు రోడ్డెకినా పెదవి విప్పన దాఖలాలు లేవు. ప్రజాప్రతినిధులుగా ఉండి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ఇలాంటి సమయాల్లోనూ కనీసం పరామర్శించకపోవడం మహిళల రక్షణ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటితో అర్థమవుతుంది.

పాస్టర్ మృతిపై ఆగని ఆందోళనలు

పాస్టర్ ప్రవీణ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై క్రైస్తవ సంఘాలు భగ్గుమంటున్నాయి. క్రైస్తవ మత ప్రచారకుడు ప్రవీణ్ ప్రగడాల అనుమానాస్పద మృతి యావత్ ప్రజానికాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసిన విషయం విధితమే. పాస్టర్ ప్రవీణ్ మద్యం సేవించి వాహనం నడపటంతో సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యారంటూ సోషల్ మీడియాలో ఓ వర్గం

విస్తృతంగా ప్రచారం చేస్తుంది. అంతే ధీటుగా క్రైస్తవ సంఘాలు స్పందిస్తున్నాయి. అదే సోషల్ మీడియా వేదికంగా ఈ ప్రచారాన్ని కొట్టిపడేస్తూ తమదైన శైలిలో యువత విశ్లేషణలు ఇస్తున్నారు. ఇలా అభిప్రాయం వ్యక్తం పరిచిన వారిపైనా కేసులు నమోదుకు పోలీసులు చర్యలకు ఉపక్రమించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.అదే విధంగా క్రైస్తవ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఈ వారంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో వేలాదిగా పాల్గొని తమ మద్దతు తెలిపారు. అయితే పోలీసులు ఇప్పటికీ ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. పాస్టర్ ప్రవీణ్ మృతదేహం ముఖం, చేతులపై గాయాలు ఉన్నాయని పోస్టుమార్టం ప్రాథమిక రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. ఇటువంటి సున్నిత మైన అంశాన్ని ఎటువంటి అపోహలకు దారి తీయకుండా క్రైస్తవ సమాజానికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఈ నేపథ్యంలో తుది రిపోర్టుకు ప్రాధాన్యత సంతరించుకుంది.

వక్ఫ్ బిల్లు సవరణపై ముస్లిం సంఘాల భగ్గు

కేంద్రం ప్రభుత్వ తీసుకొచ్చి వక్ఫ్ బిల్లు సవరణలపై ముస్లిం సంఘాలు భగ్గుమంటున్నాయి. పార్లమెంటులో ప్రతిపక్షాలు ఈ సవరణ బిల్లును వ్యతిరేకించినప్పటికీ ఎన్‌డిఎ సభ్యుల మెజారిటీతో ఆమోదం లబించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ముస్లిం సంఘాలు రోడెక్కాయి. తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలకు ప్రజాస్వామిక వాదులు, వామపక్ష పార్టీలు సైతం మద్దతు తెలిపాయి. అయితే రాష్ట్రంలోని టిడిపి, వైసిపి సభ్యులు పార్లమెంటులో ఈ బిల్లుకు ఎన్‌డిఎకు అనుకూలంగా ఓటేయటం విమర్శలకు దారి తీసింది. మరోసారి వారి ద్వంద వైఖరిని దర్పణం పట్టింది. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల నేతలు నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలకు పాల్పడుతున్న విషయం విధితమే. ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఈ సమావేశాల్లో కనీసం నోరు మెదిపిన దాఖలాలు లేవు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం బిజెపికి అనుకూలంగా వక్ఫ్‌బిల్లుకు ఆమోదం తెలిపారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజాభిప్రాయాన్ని గౌరవించని ఈ మూడు పార్టీలు రాబోయేరోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతోంది.

ఆకట్టుకున్న అమరావతి చిత్రకళా ప్రదర్శన

అమరావతి చిత్రకళా ప్రదర్శన పేరుతో రాజమహేంద్రవరంలో చేపట్టిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది. సాంస్కృతి రాజధానిగా పేరుగాంచిన నగరంలో మరోసారి కళాకారులు ఒకే వేదికపైకి వచ్చేందుకు సాంస్కృతి శాఖ చేసిన ప్రయత్నం కళాప్రియులకు కనువిందు చేసింది.

నియోజకవర్గంలో మరింత అభివృద్ధి

ప్రజాశక్తి - పిఠాపురం

డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో నియోజవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఎంఎల్‌సి కె.నాగబాబు అన్నారు. శనివారం మండలం పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రభుత్వ విప్ పి.హరిప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పిఠాపురం నియోజక వర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చిన పవన్ కల్యాణ్ శాసన సభ్యునిగా విజయం సాధించిన మొదట రోజు నుంచే మాటను నిలబెట్టుకున్నారన్నారు. తాను నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖతో ఇతర శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా మినీ గోకులాలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి చాలా వరకు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

చిన్న జంగం పేటలో సిసి రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి నాగబాబు

వినియోగం పిసరంత.. బిల్లు కొండంత..!

ప్రజాశక్తి - సామర్లకోట

గడచిన ఆరు నెలలుగా ఖాళీగా ఉన్న ఇంటికి ఒక్క లైట్ మాత్రమే వినియోగంలో ఉండగా అధిక మొత్తంలో బిల్లులు రావటం పట్ల స్థానిక సంగీతరావుపేట, వినియోగదారురాలు ఆట్ల వెంకట రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వాడని విద్యుత్ బిల్లుకు సంభందించి నెలనెలా వస్తున్న బారెడు బిల్లుపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటిలో ఒక పోర్షన్ గతంలో అద్దెకు ఇచ్చామని, సుమారు ఆరు నెలలుగా పోర్షన్ ఖాళీగా ఉందని, ఒక లైట్ తప్ప ఏమీ వినియోగించడం లేదన్నారు. మార్చి నెలలో వచ్చిన బిల్లులో "0" యూనిట్లు విద్యుత్ వినియోగం ఉన్నప్పటికీ, పలు ఛార్జీల పేరుతో రూ.855.26 పైసలు బిల్లు ఇచ్చారని ఆమె చెప్పారు. గత ఆరు నెలలుగా తమ ఇంటి పోర్షన్ ఖాళీగా ఉందని అద్దెకు ఎవరూ లేరని స్థానిక సంగీతరావుపేటకు చెందిన వెంకటరమణ చెప్పారు. ప్రతినెలా బిల్లు కరెంట్ కాల్చినప్పుడు 50 నుండి 100 రూపాయల లోపు వచ్చేదని, అదనపు చార్జీల పేరుతో విద్యుత్తు వాడకపోయినా ఎప్పుడో కాల్చారు అంటూ తాజాగా అధికంగా బిల్లు పంపారన్నారు. అలాగే జనవరి నెలలో కూడా రూ.845.87 విద్యుత్ బిల్లు అదనంగా వసూలు చేశారన్నారు. రీడింగ్ తీయడానికి వచ్చిన సిబ్బందిని ప్రశ్నించగా వారు సరిగా సమాధానం ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లులతో వెంకటరమణమ్మ ఆవేదన

నేరాలు ఘోరాలు

స్నానానికి దిగి యువకుడి మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గోదావరి నదిలో స్నానానికి దిగిన యువకుడు గల్లంతైన సంఘటన కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో శనివారం జరిగింది. రెవెన్యూ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపేట మార్కెట్ వీధికి చెందిన రొట్టా దుర్గాప్రసాద్ (22). మరో 4 గురు స్నేహితులతో కలిసి కేదార్లంక ఇసుక ర్యాంపు సమీపంలో గోదావరి నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ పోలీస్ అధికారులు నదిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమయ్యింది. ఈ ప్రమాదం నుంచి నలుగురు బయటపడ్డారు. కేదార్లంక ర్యాంప్ వద్ద ఇసుక తవ్వేయడం వల్ల ఏర్పడిన గుంతల్లో గల్లంతయ్యి చనిపోయాడని ఆరోపిస్తూ కొత్తపేటకు చెందిన కుటుంబీకులు బంధువులు మృతదేహం వద్ద ధర్నా నిర్వహించారు. ఇసుక ర్యాంపు గుంతల కారణంగా చనిపోయిన దుర్గాప్రసాద్ కుటుంబానికి న్యాయం జరగాలంటూ నినాదాలు చేశారు. సంఘటనా స్థలాన్ని మండపేట సిఐ దొర రాజు , అంగర ఎస్ఐ రవికుమార్, గ్రామ విఆర్ఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు, బంధువులతో చర్చలు జరుపుతున్నారు.

లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గడ్డి ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. శనివారం మధ్యాహ్నం ఉప్పాడ నుంచి కాకినాడ వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను ఎస్‌పిజిఎల్ శివారులో వెనక నుంచి వస్తున్న లారీ ట్రాక్టర్‌ను తప్పించబోయి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉప్పాడ బీచ్ రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రుణాల కోసం 7న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసే రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను ఈ నెల 7న నిర్వహించినున్నట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే ఇంటర్వ్యూలలో మండల పరిధిలోని జి.రాగంపేట, పులిమేరు, దివిలి, తిరుపతి, తూర్పుపాకలు, చంద్రమాంపల్లి, గుడివాడ, ఉలిమేశ్వరం మర్లావ, కట్టమూరు, కాండ్రకోట గ్రామాలకు సంబంధించిన దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో పశువుల కోసం నిర్మిస్తున్న నీటి తొట్టికి సర్పంచ్ మందేటి వీరలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నామసాని వాసు, కానూరి కాసులు, సోము నారాయణరావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కిర్లంపూడి

నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్వగృహంలో పార్టీకి చెందిన వివిధ విభాగాల అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గౌతు స్వామి, సురమర్ల మధు, జువ్విన వీర్రాజు, గుడాల వెంకటరత్నం, అంకంరెడ్డి సతీష్ కుమార్, చెన్నాడ సత్తిబాబు, సర్నం శ్రీను పాల్గొన్నారు.

'వడ్డి'కి ఉగాది నంది పురస్కారం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

విశ్వజన జన కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు ఉగాది నంది పురస్కారం అవార్డు అందుకున్నారు. పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

దీపక్‌ను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

రాజమహేంద్రవరంలోని ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్యాయత్నం, మృతికి కారణమైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థినిని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత కనీసం పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిందితుడికి కఠినంగా శిక్ష పడేలాగా చర్యలు తీసుకోవాలన్నారు.

నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎంఎల్‌సి కె.నాగబాబు అన్నారు. శనివారం మండలంలో కొత్తపల్లి, ఉప్పాడ, అమరవల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విప్ హరిప్రసాద్, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 973 హాజరు

ప్రజాశక్తి - కాజులూరు

వివిధ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాల కోసం 973 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారని ఎంపిడిఒ జె.రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక జడ్‌పి పాఠశాలలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. కాపు, ఇబిసి, బ్రాహ్మణ, రెడ్డి, క్షత్రియ, కమ్మ సామాజిక వర్గ కార్పొరేషన్‌లకు సంబంధించి 1 752 మంది దరఖాస్తులు చేసుకోగా శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 973 మంది హజరయ్యారని అన్నారు. త్వరలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అన్నారు.

వల్లభస్వామికి రూ 3.25 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామం ఉన్న శృంగారం వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3.25 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,18,640, అన్నదాన విరాళాల ద్వారా రూ.76,104, తులాభారం ద్వారా రూ.200, కేశఖండన ద్వారా రూ.6,880 లడ్డూ ప్రసాదం ద్వారా రూ.24 వేలు, కానుకుల ద్వారా రూ.110 మొత్తం రూ.3,25,934 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

రోడ్లను ప్రారంభించిన ఎంఎల్‌సి నాగబాబు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చినజగ్గంపేట, వన్నెపూడి గ్రామాల్లో భారీ పోలీసు బందోబస్తు మధ్య జనసేన పార్టీ ఎంఎల్‌సి నాగబాబు శనివారం పర్యటించారు. చినజగ్గంపేట, వన్నెపూడిలో రూ.58.60 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఎంఎల్‌సిలు కె.నాగబాబు, పిడుగు హరిప్రసాద్, ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాడా పీడీ చైతన్య వర్షిణి, ఎంపిడిఒ కె.స్వప్న, తహశీల్దారు కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి సర్వతోముఖాభివృద్ధే 'గమ్యం' లక్ష్యం

ప్రజాశక్తి-పెదపూడి

గమ్యం విద్యాసంస్థల లక్ష్యం విద్యార్థి సర్వతోముఖాభివద్ధి అని విద్యాసంస్థల అధినేత కర్రి శివారెడ్డి అన్నారు. గమ్యం విద్యాసంస్థల 14వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ 400 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ విద్యాసంస్థలు ఈరోజుకి 2100 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయిని విద్యను అందించడమే గమ్యం లక్ష్యమని అందులో భాగంగానే తమ విద్యాసంస్థలను అభివద్ధి చేస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథులు డాక్టర్ ఎపిజె వేణు (సైకాలజిస్ట్), వై.శివప్రసాద్ (రిటైర్డ్ ఇస్రో సైంటిస్ట్), డాక్టర్ కె.సునీల్ కుమార్ రెడ్డి, డాక్టర్ కె.సునీల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-గండేపల్లి

మండల కేంద్రమైన గండేపల్లిలో డాక్టర్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వాలీబాల్ పోటీల్లో విజేతలకు మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, ఎస్ఐ శివ నాగబాబులు, సుంకవల్లి రమేష్ బహుమతులు అందించారు. ఈ పోటీలలో మొత్తం 20 టీములు పాల్గొన్నాయి.

ప్రకృతి పరిరక్షణకు పాటుపడదాం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని కోరింగ వన్యప్రాణి అభయారణ్యం ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ అన్నారు. శనివారం ఎపి నేషనల్ గ్రీన్ కోర్, ఎపి అటవీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో కోరంగి అభయారణ్యంలో నేచర్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి నడక, పక్షుల పరిశీలన, మొక్కలు, జంతువులపై అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటానికి నీటిని పొదుపు చేయాలని, చెట్లను నాటాలని, వ్యర్థాలను తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ప్రముఖ పప్పెట్రి శిక్షకులు పిల్లి గోవిందరాజు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఆయా బ్యాంకు శాఖల అధికారులు శనివారం మండల పరిషత్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. తాళ్లరేవు, చొల్లంగి, ఇంజరం యూనియన్ బ్యాంకు, తాళ్ళరేవు స్టేట్ బ్యాంక్ శాఖల బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు ఇంటర్వ్యూలు చేశారు. సోమవారం మిగిలిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు కొనసాగించనున్నట్టు ఎంపిడిఒ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పలు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు స్టేషన్ సెంటర్, ప్రెసిడెంట్ గారి వీధి, వెలమ వీధి వంటి లోతట్టు ప్రాంతాలన్నీ నీటితో నిండగా ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కారణంగా డ్రైన్లు పొంగి రోడ్లపై ప్రవహించడంతో నివాసాల్లోకి నీరు చేరుకోవడంతో ప్రజలు మురుగు జలాలను బయటకు పంపించుకునేందుకు నానా అవస్థలూ పడ్డారు. ప్రధానంగా 22వ వార్డు శెట్టిబలిజిపేటలో డ్రైన్లలో పూడిక తొలగింపు చర్యలు చేపట్టకపోవడంతో డ్రైన్లలో పారాల్సిన మురుగు రోడ్లపైకి, ఇళ్లలోకీ చేరి తీవ్ర అసౌకర్యం కలిగించాయి. ఆర్‌టిసి బస్టాండ్ నీటితో నిండుకుని చెరువును తలపించింది. వెలమవీధి రామాలయం రోడ్డులో డ్రైన్లలోకి వర్షపు జలాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రధాన రహదారి జలమయంగా మారింది.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రెల్లి కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

వర్గీకరణలో రిజర్వేషన్ శాతం రెల్లి అనుబంధ కులాలకు అన్యాయం జరుగుతోందని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పిఠాపురం రెల్లికుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రిజర్వేషన్ వర్గీకరణలో అత్యధికంగా ఉన్న రెల్లి ఉపకులాలకు ఒకటి శాతం రిజర్వేషన్ కల్పించడం ఆన్యాయమన్నారు. 2011 కంటే రెల్లి కులస్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. గతంలోనే12 ఉప కులాలకు అదనంగా, బుడగా జంగం కులాన్ని చేర్చడం ఏమీ న్యాయమని ప్రశ్నించారు. తాజా జనాభా సంఖ్య ప్రాతిపదికన రెల్లి ఉపకులాలకు మూడు శాతం రిజర్వేషన్ కేటాయించాలని, బేడా బుడ్గా జంగాలను వేరే గ్రూప్ లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌-ఎస్.వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం న్యాయవాది బంగారు రామకృష్ణ, ఆకుల సూరిబాబు, అల్లం కిషోర్, ఎర్రంశెట్టి శ్రీనివాస్ ఇంటి రాంబాబు, ధనాల నాని,అల్లం పాపారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా కమిటీలో పెద్దాపురం వాసులకు చోటు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ జిల్లా నూతన ఆర్యవైశ్య మహాసభ కమిటీలో పెద్దాపురం పట్టణానికి చెందిన పలువురు ఎంపికయ్యారు. పెద్దాపురం పట్టణానికి చెందిన ఎం.శ్రీనివాసరావు ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షునిగా, జిల్లా జోన్ ఛైర్మన్‌గా పాలకుర్తి రాజేష్, జిల్లా వాసవి సేవాదళ్ చైర్మన్‌గా గ్రంధి రాజేష్, సహాయ కోశాధికారిగా కూర్మ దాసు కిషోర్, వాణిత్య విభాగం వైస్ చైర్మన్ కాళ్ల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన సభ్యులు మట్టే శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.
పిడిపి 500 శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సభ్యులు

అకాల వర్షాలతో నేలంటిన వరి పంట

ప్రజాశక్తి-కోటనందూరు

అకాల వర్షాలు మెట్ట ప్రాంత దాళ్వా రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. శనివారం ఉరుములు, మెరుపులు పెనుగాలులతో కూడిన భారీ వర్షం రెండు గంటలు కాకరపల్లి, కోటనందూరు, అల్లిపూడి గ్రామాల్లో కురిసింది. కాకరపల్లి గ్రామంలో చిన్న, సన్న కారు రైతులు సుమారు 105 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పొలాలు భారీ వర్షాలకు పూర్తిగా నేలమట్టం అయ్యాయని కాకరపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆకుల రాజాబాబు, గంటా కొండబాబు, గుండుబోగుల రాము, శివాలంక రమణ, కీర్తి లోవరాజు, కీర్తి బాబ్జి, కీర్తి నాగేశ్వరావు, బంటుపల్లి రమేష్, రైతులు కంటతడి పెట్టుకున్నారు. ఒక్కొక్క ఎకరానికి సుమారు రూ.31 వేలకు పైగా దుక్కు, ఎరువులు, క్రిమిసంహారక మందులు , కూలీలకు అప్పులు చేసి దాళ్వా వరి పంటకు పెట్టుబడులు పెట్టినట్టు వాపోయారు.

పట్టణాభివృద్ధి కమిటీ పూర్వ అధ్యక్షులు అచ్యుతరావు మృతి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పటణాభివృద్ధి కమిటీ పూర్వ అధ్యక్షులు అరిశం అచ్యుత రావు వయోభారంతో మృతి చెందారు. వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాలలో పనిచేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పదవీ విరమణ అనంతరం కాకినాడ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పట్టణాభివృద్ధి కమిటీకి అధ్యక్షుడిగా చురుగ్గా పనిచేసి సేవలందించారు. వైద్య ఆరోగ్య శాఖలో ఖమ్మం జిల్లాలో పనిచేస్తూ వారి యూనియన్‌కు నాయకత్వ వహిస్తూ సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలకు సహకారం అందించారు. ఖమ్మం జిల్లాలో మాజీ ఎంపీ, ఎంఎల్ఎ తమ్మినేని వీరభద్రంతో సన్నిహితంగా మెలిగారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా సంఘాల నాయకత్వంలో నిర్వహించబడిన అనేక ప్రజా కార్యకలాపాలలో అచ్యుతరావు చురుగ్గా పాల్గొన్నారు. సిపిఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ అచ్యుతరావు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పట్టణ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు మేక సుబ్బారావు సంతాపం తెలిపారు.

పడిపోయినది

పెట్ల తరుణ్ కుమార్, హైదరాబాదులో గల టిసిఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వ్యక్తి, తన బైక్ మీద తన నల్లని బ్యాగులో నల్ల రంగు గల డెల్ కంపెనీ చెందిన లాప్టాప్ సీరియల్ నెంబర్ **D3B6563** గల దానిని తీసుకుని హైదరాబాద్ వెళుతుండగా తూ॥గో॥జిల్లా, దేవరపల్లి మండలంలో గౌరీపట్నం నుండి సూర్యనారాయణపురం మధ్యలో తన బ్యాగు కింద పడిపోయినట్లు ఎవరికైనా కనిపించిన ఎడల తన బ్యాగ్‌ను మరియు లాప్టాప్‌ను తీసుకొని వచ్చి ఇవ్వవలసిందిగా తెలియజేయడమైనది. ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

పెట్ల తరుణ్‌కుమార్
S/o. శ్రీనివాసరావు,
సెల్: 7032322801

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం. 12285/2002-ఎ16 తేది.04-04-2025

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధీనములోని వివిధ షాపింగ్ కాంప్లెక్సులలో ఖాళీగా ఉన్న షాపు రూములు (జాబితాలో 8వ కాలము నందు చూపబడిన రిజర్వుడు కేటగిరి షాపులు మినహాయించి) స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితూ 3 సంవత్సరముల కాలమునకు నెలవారి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్తుహక్కు వేలమును నగరపాలక సంస్థ కార్యాలయము నందు ది. 16-04-2025 తేదీ నుండి 19-04-2025 తేదీ వరకు నిర్వహించబడును.

వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు యిందుతో జతపర్చబడిన పట్టికలో చూపిన ప్రకారము ధరావత్తు సొమ్ము కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు మూడు సంవత్సరముల కాలమునకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఆఫీసులో ది. 15-04-2025వ తేదీ సాయంత్రం గం॥ 5.00 లోపు దరఖాస్తు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరింపబడవు. ఒక్కొక్క షాపునకు విడివిడిగా ధరావత్తు, బ్యాంకు గ్యారంటీ, ఆధార్ జిరాక్సులతో దరఖాస్తు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలు పరిచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు నగరపాలక సంస్థకు ఏవిధమైన బకాయిలు వుండరాదు.

వేలములో ఖాయపరచిన అద్దెతో 3 నెలల సొమ్మును (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7 దినములలోగా చెల్లించిన తదుపరి షాపు అప్పగించబడును. వేలములో ఖాయపరచిన అద్దెపై 18% జి.ఎస్.టి. తో ప్రతి నెల 10వ తారీఖు లోగా కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము 3 సంవత్సరములు, తదుపరి ప్రతి 3 సంవత్సరములకు స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33 1/3 శాతం పెంపుదల (లేదా) 10% మార్కెట్ విలువను సంవత్సరము అద్దెగా లేదా పరిసరాల ప్రాంతాలలోని షాపుల అద్దె విలువ ఏది అధికమో దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై లీజు పొడిగించబడును. లీజుకాలము గరిష్టముగా 25 సంవత్సరముల వరకు మాత్రమే పొడిగించబడును. తదుపరి షాపు నగరపాలక సంస్థకు విధిగా అప్పగించవలెను. వేలం ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమిషనరు గారికి పూర్తి అధికారము కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను. నగరపాలక సంస్థ కార్యాలయములో రెవెన్యూ విభాగము నందు ఎ16 సీనియర్ అసిస్టెంట్ నుండి షాపులు, నెలవారీ అద్దె, చెల్లించవలసిన ధరావత్తు, దాఖలు చేయవలసిన బ్యాంకు గ్యారంటీ, వేలం నిర్వహించుచున్న తేదీ మొదలగు వివరములను పొందగలరని తెలియచేయడమైనది.

సం/- **కమిషనరు**
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం